

# సహచర్యం

## - సి. లలిత

"నేను ఈ జూన్‌లో రిటైరు అవుతున్నాను కదా? మరినీ మాటేమిటి?" అన్నారు కృష్ణమూర్తి భార్యతో.

"నాకు ఇంకా నాలుగు సంవత్సరాలు సర్వీసు ఉందిగా" అంది అన్నపూర్ణ.

"అంటే, నేను రిటైరయిన తర్వాత నువ్వింకా ఉద్యోగం చేస్తానంటావా?"

"ఏం, ఎందుకు చెయ్యను? నేను మీకంటె చిన్నదాన్నే కదా!" అంది చిరునవ్వుతో అన్నపూర్ణ.

"అయితేమాత్రం, నేను రిటైరయి ఇంట్లో కూర్చుంటే, నువ్వు ఉద్యోగానికి వెళతావా? అదేం బాగుంటుందే! నేను ఇంట్లో కూర్చోవడమేమిటి? నువ్వుస్కూలుకి వెళ్లటమేమిటి? అదేం బాగుండదు. నువ్వు కూడా రిటైరవవలసిందే"

"అదేవిటండీ! ఇప్పుడు వలంటరీ రిటైర్‌మెంటు స్కీముకూడా తీసేసారుకదా! అంటే రిజైనివ్వాలి. దానివల్ల ఎన్నో నష్టాలున్నాయి. అయినా, నేను ఉద్యోగం చేస్తూ నాలుగు డబ్బులు సంపాదిస్తే తప్పేముంది?"

"ఏమో నాకదంతా తెలియదు. నేనింట్లో కూర్చుంటే, నువ్వు ఉద్యోగానికి వెళ్లడం నాకు నామోషి"

"అయితే మీరుకూడా ఏదైనా ఉద్యోగంలో చేరండి కొంత కాలక్షేపం ఉంటుంది."

"అబ్బే, నేను మళ్లీ ఉద్యోగంలో చేరను. ఈ మధ్య ఎక్కడో కథలో చదివాను. 'రిటైర్‌మెంటు కోసం ఎదురు చూసేవాడిని, ఈ రిటైర్‌మెంటు నాకు కావలసిన శాంతిని, విశ్రాంతిని ఇస్తోంది', అని ఆయన అన్నాడు, నేను కూడా ఆ కోవలోకే వస్తాను. అంచేత నేను మళ్లీ ఉద్యోగం చెయ్యను" అన్నారు కృష్ణమూర్తి.

"అయితే అసలు నన్ను ఉద్యోగంలోకి ఎందుకు దింపారు? నేను ఎంతో చెప్పేదాన్ని 'నేను ఉద్యోగంలో చేరితే పిల్లలు బాధపడతారండీ' అని 'అబ్బే ఫరవాలేదు. నీ తెలివి తేటలు వృథా అవకూడదు. అయినా డబ్బు వస్తూంటే వద్దనకూడదు.' అంటూ నన్ను ఉద్యోగంలోకి తోసారు. పిల్లలిద్దరు పెద్దవాళ్లయ్యేవరకు ఎంతకష్టపడవలసి వచ్చిందో మీకూ తెలుసు. ఇప్పుడిప్పుడు కొంచెం రిలాక్సింగ్‌గా ఫీలవుతూ ఉద్యోగం చేస్తున్న టైములో ఉద్యోగం మానెయ్యమంటారేవిటండీ" అంది అన్నపూర్ణ కొంచెం బాధగా.

అన్నపూర్ణకి అంతా అయోమయంగా వుంది. తన భర్త సంగతి తనకు పూర్తిగా తెలుసు. దేనికీ నిదానంగా ఆలోచించడు. ముప్ఫయి అయిదేళ్లనుండి ఆయనతో కాపురం చేస్తోంది. అప్పటికి ఇప్పటికీ అంతే.

❋ ❋ ❋ ❋ ❋

తను బి.ఏ పాసవగానే తండ్రి పెళ్లి ప్రయత్నాలు మొదలుపెడితే తనకు ఇంకా చదవాలని ఉందని తండ్రితో చెప్పాలని అనిపించలేదు అన్నపూర్ణకు. అప్పట్లో బి.ఏ అంటే గొప్పేమరి. చదువు అయింది కాబట్టి, ఇంక తరువాయి స్టేజి పెళ్లి అని తనకూ తెలుసు. ఇప్పటి రోజుల్లోలా ఆడపిల్లలను స్వప్న వీధుల్లో విహరింపజేసే వాతావరణం తమ ఇంట్లో ఉండేది కాదు. అప్పటికి ఈ టీవీలు ఇంకా రాలేదు. మాగజైన్సు కూడా అట్టే ఉండేవి కావు. ఉన్న వాటిలో సత్ సాహిత్యం తప్ప అన్నిటికీ తమ ఇంట్లోకి వచ్చే అర్హత ఉండేదికాదు.

తండ్రి సంబంధాలు చూడటం మొదలు పెట్టారే కాని, తగిన సంబంధం కుదరడం కష్టం అని మొదటి కొన్ని నెలల వరాన్వేషణలోనే తెలిసిపోయింది. అంచేత అన్నయ్య ప్రోత్సాహంతో ప్రైవేటుగా ఎం.ఏ చదవడానికి తను నిర్ణయించింది. తండ్రి కూడా అభ్యంతరం పెట్టలేదు. సంబంధం కుదిరి, వివాహం సెటిల్ అయ్యేసరికి తను బి.ఎడ్., కూడా పూర్తి చేసింది. అన్నయ్య పట్టుబట్టి పెళ్లి శుభ లేఖల మీద 'అన్నపూర్ణ ఎమ్.ఏ.బి.ఎడ్. అని వేయించాడు కూడాను.

అనుకున్న దానికంటే ఆలస్యం అయినా, అన్నపూర్ణకు మంచి సంబంధమే దొరికింది. భర్త కృష్ణమూర్తి డాక్టరేట్ పొంది, పెళ్లి సమయానికి యూనివర్శిటీలో లెక్చరరు. ఇటు పాఠాలు చెప్పటంలోను, అటు రీసెర్చివింగ్‌లోను 'మంచి దిట్ట' అని పేరు సంపాదించినవాడు. అన్నపూర్ణకు చిన్నతనం నుంచి తండ్రీ సోదరులు పెంచుతూ వచ్చిన విజ్ఞాన పిపాస అనే మొక్క, భర్త సాన్నిధ్యంలో, అతని సహకారంతో పెరుగుతూ పువ్వులు, కాయలతో విరాజిల్లింది.

కొత్తకాపురంలో అడుగు పెట్టిన తనకు కొత్త వాతావరణంలో ప్రవేశించినట్లనిపించేది కాదు. భార్యా భర్తలిద్దరూ అనేక వర్తమాన విషయాలపై సమఉజ్జీగా చర్చించుకునేవారు. ఆ చర్చల్లో విభేదాలు వచ్చినా, వాటిని తీవ్రస్థాయికి వెళ్లనీయకుండా జాగ్రత్తపడేది అన్నపూర్ణ. భార్యా భర్తల వివాదాలు తాత్కాలికాలు. అందులో అవి సంసారానికి సంబంధించక, ఏవో లోకం పోకడల మీద అయితే మరీను. ఈ నిజాన్ని గ్రహించి తమిద్దరి మధ్య వాదం తీవ్రతరం రాకుండా జాగ్రత్తపడేది అన్నపూర్ణ.

కృష్ణమూర్తి తను పెద్ద చదువు చదువుకున్న వాడిననే గర్వము, అహంభావము లేనివాడు. కాగా తన భార్య చదువుకున్నదని, తెలివి తేటలు గలదని గర్వించేవాడు. తన భార్య తెలివి తేటలను నలుగురికీ తెలియబర్చాలని ప్రయత్నించేవాడు. అందరికీ అన్నీ మంచి గుణాలే ఉండవు కదా! అలాగే

కృష్ణమూర్తికి చిరుకోపం, కొంచెం పట్టుదల ఉండేవి. అన్నపూర్ణ వీటిని పెళ్లయిన కొత్తల్లోనే గ్రహించి మొదటి నుండి జాగ్రత్తగానే మసులుకొనేది. ఈ సర్దుకు పోవటం అలవాటై, భర్తకు ఎక్కడ కోపం వస్తుందో, అతని మనస్సు ఎక్కడ కష్టపడుతుందో అని, తన మనస్సులో ఉన్నది భర్తతో గట్టిగా చెప్పడానికి జంకేది.

పెళ్లయిన కొన్ని నెలలకు కృష్ణమూర్తికి తన భార్యచే ఉద్యోగం చేయించాలనే ఆలోచన కలిగింది. ఉద్యోగంలో భార్యను చేర్పించి డబ్బు సంపాదించాలని కాదు. తన భార్య తెలివి తేటలను నలుగురికీ తెలియజేయాలనే తపన.

"నువ్వు చదువుకున్న దానివి. నీ తెలివి తేటలు ఈ ఇంటి నాలుగు గోడల మధ్య వృథా అవటం నాకిష్టం లేదు. నువ్వు ఏదైనా ఉద్యోగంలో చేరితే నీ చదువుకు సార్ధకత చేకూరుతుంది. నీకిష్టమైన ఉద్యోగంలో చేరు" అన్నాడు కృష్ణమూర్తి, ఒకనాడు రాత్రి భోజన సమయంలో.

"నేనిప్పుడు ఉద్యోగంలో చేరటమెందుకండీ? ఉద్యోగం చేయాలని నేనూ ఒకానొకప్పుడు అనుకునేదాన్ని. కానీ ఈ సంసార జీవితంలోకి అడుగు పెట్టగానే ఆ ఆలోచనకు స్వస్తి చెప్పాను. నా ఉద్దేశ్యంలో స్త్రీకి ఉద్యోగం, సంసారం రెండూ జరగవు. రెండూ చేపడితే దేనికీ న్యాయం జరగదు. పిల్లల పెంపకానికి, వారి భవితవ్యానికి అన్యాయం జరుగుతుంది. డబ్బు అవసరం అయితే, తప్పనిసరిగా ఉద్యోగం చేయవలసివస్తుంది. కానీ మనకు ఆ అవసరం లేదుగదండీ" అంది అన్నపూర్ణ.

'ఇప్పుడు మనకు పిల్లలు లేరుగా. పిల్లలు పుట్టి నప్పుడు ఆలోచిద్దాంలే. ప్రస్తుతం నువ్వు ఉద్యోగం చేయటంవల్ల నీకు తగిన కాలక్షేపం అవుతుంది. నా ఉద్దేశ్యంలో నీకు తగినది టీచరు ఉద్యోగం. నీ చదువును, తెలివి తేటలను నలుగురికీ పంచిపెడితే పుణ్యం, పురుషార్ధం కూడాను' అన్నాడు కృష్ణమూర్తి.

'ఇంక భర్తతో వాదించి లాభంలేదు, పిల్లలు పుట్టినప్పుడు చూద్దాం' అనుకుని టీచరుగా జాయిన యింది అన్నపూర్ణ. మొదట్లో బాగానే ఉండేది. కానీ పెద్దపిల్ల పుట్టిన తర్వాత తనకు ఉద్యోగం తెచ్చిపెట్టే కష్టాలు తెలిసొచ్చాయి. ఇంట్లో కూతురుని చూడటానికి ఒక పనిపిల్లను పెట్టినా ఉద్యోగ రీత్యా బయటకువెళ్లి, మళ్లీ ఇంటికి తిరిగి వచ్చే వరకూ కూతురు మీదే ఉండేది ధ్యాస. టీచరుగా తను ఉద్యోగానికి న్యాయం చేకూర్చలేక పోతున్నాననే బాధకూడా కలిగేది. పెద్దపిల్ల తర్వాత రెండేళ్లకు బాబు పుట్టిన నాటి నుండి అన్నపూర్ణకు మరీ కష్టంగా ఉండేది. అప్పుడప్పుడు భర్తతో అనేది, ఉద్యోగానికి రిజైను చేస్తానని.

"ఇవన్నీ మెల్లిగా సర్దుకుపోతాయి. కంగారుపడి ఉద్యోగం వదులుకుంటే తర్వాత విచారించవలసి వస్తుంది." అనేవాడు కృష్ణమూర్తి.

తల్లిసాన్నిధ్యంలో పెరిగే పిల్లలకు, ఉద్యోగరీత్యా తల్లి బయటకు వెళ్లినప్పుడు ఆయాల దగ్గర పెరిగే పిల్లలకు మనోవికాసంలో చాలా తేడా ఉంటుంది. తల్లి పోషణలో పెరగని పిల్లలకు పిరికితనం, మనోదౌర్బల్యం ఎక్కువవుతాయి. ఇది వారి భావీజీవితాలకు అంత మంచిదికాదు. అథమం అయిదారేళ్లు వయస్సు వచ్చే వరకైనా పిల్లలు తల్లి సంరక్షణలో పెరగాలి అని మనోశాస్త్రవేత్తలు రాసే వ్యాసాలు చదివినప్పుడు తను తన పిల్లలకు చాలా అన్యాయం చేస్తున్నానని బాధపడుతూ ఉండేది అన్నపూర్ణ.

పిల్లలు పెద్ద వాళ్లయి, స్కూల్లో జాయినయిన తర్వాత తనుకూడా తన రొటీన్‌కు అలవాటుపడి మనస్సును ఆందోళన పరిధి నుండి కొంత తప్పించ గలిగే స్థితికి వచ్చింది అన్నపూర్ణ. తను టీచరుగా కూడా మంచి పేరుగడించింది. సర్వీసులో సీనియారిటీ సంపాదించగలిగింది. ఉద్యోగం



చలికాలంలో జుట్టు పొడారినట్లు అయిపోతుంది. అందుకే రాత్రిపూట పడుకోబోయే ముందు గోరువెచ్చని నూనె తలకు బాగా పట్టించి మసాజ్ చెయ్యండి. ఇక ఉదయం పూట నూనె రాయవద్దు.

- ప్రియాశ్రీ

మానేయాలనే ఆలోచనను దూరం చేయగలిగింది.

స్కూలు ఫైనల్ పరీక్ష రాసిన కూతురు తనతో -

"అమ్మా నువ్వు ఉద్యోగం చేస్తూ, మాకు అండగా ఇంట్లో లేకపోవటం, మాకు ఇప్పుడు అంతకష్టంగా అనిపించటం లేదు. కానీ, మాకు తెలిసీ తెలియని వయస్సులో నీకోసం, ఇంటికి నీ రాక కోసం నేను, తమ్ముడు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తూ ఉండేవాళ్లం. నువ్వు ఇంట్లోలేని టైములో మాకు భయం భయంగా ఉండేది. ఒంటరితనం ఫీలయ్యేవాళ్లం. నా స్వానుభవం వల్ల నేను తీసుకున్న నిర్ణయం ఏమిటో తెలుసా?

"నేను మాత్రం నా పిల్లలను నిస్సహాయులుగా ఇంట్లో వదలి ఉద్యోగం చేయను. ఒకవేళ ఉద్యోగమే చేయవలసివస్తే పిల్లలను కనను" అంది. చిన్నపిల్ల మాటలతో జీవితంలో తను ఎంత తప్పు చేసిందో తెలుసుకోగలిగింది అన్నపూర్ణ.

ఇప్పుడు పిల్లలిద్దరూ పెద్దవాళ్లయ్యారు. పెళ్లిళ్లయ్యాయి. వారి సంసారాలు వారు చూసుకుంటున్నారు. తను ఏ బాదర బందీ లేకుండా ఉద్యోగం చేయగలుగుతూ ఉంది. ఈ సమయంలో భర్త తనను ఉద్యోగం మానెయ్యమనడం తనకు కష్టంగా ఉంది. భర్తతో వాదించి లాభం లేదు. అయినా ఇంకా టైము ఉంది కదా అని మనస్సును సమాధాన పర్చుకుంది.

కూతురు కిరణ్మయి నర్సరీలో చదువుతున్న తన కొడుకుని తీసుకుని తల్లిదండ్రులను చూద్దామని వచ్చింది. ఒకనాడు మాటల సందర్భంలో కిరణ్మయి, తల్లితో,

"అమ్మా! నాన్న ఈ ఏడాది రిటైరవుతారనుకుంటాను" అంది.

"అవును. ఈ జూన్‌లోనే మీ నాన్నగారి రిటైర్మెంటు" జవాబిచ్చింది అన్నపూర్ణ.

"అయితే తర్వాత ఏం చేద్దామనుకుంటున్నారు?" అడిగింది కిరణ్మయి.

"ఆయన ఏమీ చేయరట. నన్ను కూడా ఉద్యోగం మానమంటున్నారు"

"అదేవిటే! నీకు ఇంకా సర్వీసు ఉందిగా?"

"ఉంది కానీ ఆయన రిటైరయి ఇంట్లో కూర్చుంటే, నేను ఉద్యోగం చేయటం ఆయనకు నామోషీగా ఉంటుందిట. అంచేత నన్నుకూడా మానేయ్యమంటున్నారు."

"నువ్వేమన్నావు మరి?"

"నేనేమంటానే. మీనాన్నగారి సంగతి నీకు తెలుసుగా నాకు ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు."

"అమ్మా! నువ్వు చదువుకున్న దానివి. ఎన్నాళ్ల నుంచో ఉద్యోగం చేస్తున్నావు. కానీ నీకు నీ పాతకాలం గుణాలు మాత్రం పోలేదు. నీకిష్టం లేకపోయినా, పిల్లలు బాధపడతారని నువ్వు ఎంత చెప్పినా వినక, ఒకప్పుడు నిన్ను ఉద్యోగంలోకి నెట్టారు. ఇప్పుడు తను రిటైరవుతున్నారని, తను చేయనప్పుడు తన భార్య ఉద్యోగం చేయడం తన పరువుకు నష్టం అని నిన్ను ఉద్యోగం నుంచి మానెయ్యమంటున్నారు. అన్నీ ఆయన ఇష్టాలే కాని, నీ ఇష్టా ఇష్టాలతో పనిలేదా? నువ్వు ఆయన ఏం చెప్పినా తల ఊపుతున్నావు. అమ్మా నీకొక వ్యక్తిత్వం అంటూలేదా, నాకు తెలియకడుగుతాను" అంది కోపంగా కిరణ్మయి.

"అమ్మాయీ! నీకు తెలియదమ్మా మీ నాన్న స్వతహాగా చాలా మంచివారు. నా చదువుకు, నా తెలివి తేటలకు ఎప్పుడూ గౌరవం ఇచ్చారు. నా గొప్పతనం నలుగురిలో చాటడానికే నన్ను ఉద్యోగంలో చేర్చారు. సంసారంలోని బాధ్యతలు ఘనకర్ధమయినట్లు మగవారికి అంత అర్థంకావు. మీ చిన్నతనంలో నేను ఉద్యోగం చేస్తూ మీరు, నేనూ పడిన బాధలు ఆయనకు అంత కష్టం అనిపించలేదు, అంచేత నన్ను ఉద్యోగం మానవద్దనేవారు. ఎలాగో కష్టపడి ఉద్యోగం చేసాను కాబట్టి ఇప్పుడు స్కూలుకి ప్రిన్సిపాల్ అయ్యే సీనియారిటీ

సంపాదించాను. కొద్ది నెలల్లో అవవచ్చు కూడాను" అంది అన్నపూర్ణ.

"నువ్వు ప్రిన్సిపాల్ అవటం అనేది నాన్న నిన్ను ఉద్యోగం చెయ్యనిస్తేగదా! అవును, నువ్వు ఏం నిర్ణయానికొచ్చావు? ఉద్యోగానికి రిజైన్ చేస్తానంటావా?"

"ఏదీ ఆలోచించలేదే. ఇంకా టైముందిగదా"

"అంటే నాన్నమాటను ఎదిరించే ధైర్యం ఇప్పటికీ నీకు రాలేదన్న మాట ఆయన తన కోణంలోంచి ఆలోచించి నిన్ను త్యాగం చేయమంటున్నాడే! ఆయన చెప్పినవన్నీ అంగీకరించడానికి ఇవి పురాణపు రోజులు, మీ అమ్మ అమ్మమ్మల రోజులుకావే. భర్త మాటకు ఎదురు తిరిగి నిన్ను తిరగబడమని నేను చెప్పటంలేదు. కాని అమాయక స్త్రీలా ప్రవర్తించక, భర్త మాటలలోని మంచి చెడ్డలు నీ కోణంలోంచి ఆలోచించి నిర్ణయం తీసుకోమంటున్నాను అంతే. నువ్వు ఉద్యోగానికి రిజైనివ్వటం నాకిష్టం లేదు. నాన్నతో నేను ఈ విషయం మాట్లాడతాను" అంది కిరణ్మయి ఉద్వేగంగా.

"కంగారు పడకమ్మా! నేనింకా ఏ నిర్ణయం తీసుకోలేదుకదా! పిల్లవాడి సెలవలకని వచ్చావు. నీకెందుకు అనవసర గొడవలు. నువ్వు ఈ విషయం మాట్లాడితే మీ నాన్న మనసు నొచ్చుకుంటుంది." అంది అన్నపూర్ణ.

❋ ❋ ❋ ❋ ❋

"నాన్నా, మీరు ఈ జూన్‌లో రిటైరవుతారనుకుంటాను. తర్వాత ఏం చేద్దామనుకుంటున్నారు?" అంది తండ్రితో కిరణ్మయి, తల్లిని తన కొడుకుతో దగ్గరలోనే ఉన్న గుడికి పంపించి.

"చేయడానికే ముందమ్మా! నేను ముప్పై ఐదేళ్ల పైనే ఉద్యోగం చేసాను. ఇంక పూర్తిగా విశ్రాంతి తీసుకుందామనుకుంటున్నాను. మీ అమ్మను కూడా ఉద్యోగానికి రిజైన్ చెయ్యమంటున్నాను" అన్నారు కృష్ణమూర్తి.

"అదేవిటి! అమ్మకు ఇంకా చాలా సర్వీసు ఉందిగా."

"అవుననుకో.కాని నేను రిటైరయిన తర్వాత అది ఉద్యోగం చేయటం బాగుంటుందా?"

"ఏం ఎందుకు బాగుండదు. అయినా అమ్మ ప్రిన్సిపాల్ అయ్యే ఛాన్సు కూడా ఉందనుకుంటాను. చాలా సీనియర్ కదా" అంది కిరణ్మయి.

"అవును. కాని నాకు మాత్రం అది ఇంక ఉద్యోగం చేయటం ఇష్టం లేదు."

"అదేవిటి నాన్నా! అమ్మ ఇష్టా ఇష్టాలతో పనిలేకుండా ఒకప్పుడు ఉద్యోగంలోకి పంపారు. ఇప్పుడు ఉద్యోగం మానమంటున్నారు. ఇదేమైనా బాగుందా?"

"అమ్మాయీ! నువ్వు చిన్నదానివి. నీకు లోకంపోకడ తెలియదమ్మా మగవాడు ఇంట్లో కూర్చుంటే భార్య ఉద్యోగం చేయడం బాగుండదమ్మా! మగవాడి గౌరవమర్యాదలు ఆలోచించాలా వద్దా?"

"ఎప్పుడూ మగవారి గౌరవ మర్యాదలేనా? ఆడవారికి అక్కరలేదా? ఇవి సతీ సహగమనం రోజులు కావు నాన్నా! అమ్మ ఉద్దేశ్యం కనుక్కున్నారా?"

"లేదు. నా ఉద్దేశ్యం చెప్పానంతే" అన్నాడు కృష్ణమూర్తి కొంచెం బాధగా.



## విద్యార్థులకు కంప్యూటర్

'మై మేజిక్ డైరీ' అనే ఈ కంప్యూటర్‌లో మీకు తెలిసిన వాళ్ల పేర్లు, చిరునామా, టెలిఫోన్ నెంబర్లు, వాళ్ల ముఖాలు మొదలైన వివరాలు రికార్డు చేయవచ్చు. విదేశాల్లో స్కూలు పిల్లల చేతుల్లో ఇవి ఎక్కువగా కనిపిస్తున్నాయి. వీటిని వాళ్లు పెర్సనల్ నోట్ బుక్స్‌లా ఉపయోగిస్తున్నారు. కంప్యూటర్లు ఎలా పనిచేస్తాయి అన్న సంగతి తెలుసుకోవటానికి కూడా ఇవి ఉపయోగపడుతున్నాయి. -బి.ఆర్. సుంకర

కూతురు ఊరు వెళ్లిన తర్వాత కృష్ణమూర్తి భార్యతో,

"అవును, నేను ఉద్యోగం మానేయమన్నానని అమ్మాయితో చెప్పావా? దానితో మాట్లాడే బదులు నీ ఉద్దేశ్యం గట్టిగా నాతోనే చెప్పవచ్చుగా" అన్నాడు కొంచెం కోపంగా.

"నేను దానితో ఏమీ చెప్పలేదండీ. అన్నీ అదే మాట్లాడింది. దాని సంగతి మీకు తెలుసుగా" అంది అన్నపూర్ణ.

"దానిది దుడుకు స్వభావమేననుకో కాని దానికి మంచిదని తోచింది నిర్భయంగా చెప్పగల ధీమా దానికుంది. అదే దానిలో నాకు నచ్చిన గుణం. సహజంగా స్త్రీలలో లేని గుణమది. అన్నిటికి సర్దుకుపోదామనే ధ్యాసేకాని, మనస్సులో ఉన్నది, మంచిదని తోచింది ఎందుకు గట్టిగా చెప్పరో మీ ఆడవారు. 'అన్ని నిర్ణయాలూ భర్తలే తీసుకోవాలి. భార్యలు అవి తప్పక పాటించాలి' అని ఎక్కడో కొద్దిమంది తప్ప అందరు మగవాళ్లూ అలా అనుకోరు.

"నీమాటే తీసుకో. నేను ఉద్యోగంలో చేరమన్నప్పుడు నువ్వు చేయనని గాని, మానేస్తానని గాని గట్టిగా ఎప్పుడూ నాతో అనలేదు. పిల్లలు బాధపడతారండీ అనే దానివేగానీ 'నేనింక ఉద్యోగం చెయ్యను' అని ఖచ్చితంగా నాతో ఎప్పుడూ చెప్ప లేదు. ఒకవేళ నువ్వు ఉద్యోగం మానేసినా, బలవంతంగా నీ చేత చేయించగలిగేవాడినని అనుకోను. కొంతకాలం ఇంట్లో మనస్పర్ధలు ఉండేవేమో! అలా అని కూడా నేను అనుకోను. చదువుకున్న దానివి కదా అని ఉద్యోగం చేయమన్నాను. నువ్వు ఉద్యోగం చేయటంలో నీ స్వార్థం లేదనుకోకు. కాని అదంతా నా తప్పుగానే పిల్లల దగ్గర చూపించావు. మీ ఆడవారు తప్పెప్పుడూ మగవారిదే అని చూపటానికి ఎందుకు ప్రయత్నిస్తారో తెలియదు. నాకు కొంచెం కోపం, పట్టుదల ఉండవచ్చును. కాని మన పెళ్లయిన ఇన్ని సంవత్సరాలలోను నీ మాటకే ప్రాధాన్యతనిచ్చాను. అది నీకు తెలుసును.

"నీ ఉద్యోగ విరమణ విషయంలో నాకు తోచింది చెప్పాను. అప్పట్లోనే ఉద్యోగానికి వెళితే నీకు ఇంట్లో తోచదుకదా అని ఉద్యోగం చెయ్యమన్నాను. ఇప్పుడు, నేనెట్లాగూ రిటైరవుతున్నానుగదా, నువ్వుకూడా ఇంట్లో ఉంటే ఇద్దరం ఈ వయసులోనైనా సమస్యలు మరిచి తతిమ్మా జీవితకాలం హాయిగా గడిపితే బాగుంటుందని అనుకున్నాను. ఎంతైనా మనిద్దరం జీవిత సహచరులం కదా... ఈ వయసులో ఇక విశ్రాంతిగా హాయిగా కలిసి వుందామని. కానీ నీ ఆలోచనకు ప్రాముఖ్యాన్నివ్వాలని అమ్మాయి చెప్పింది. అలాగే నీకు ఉద్యోగం చేయాలని ఉంటే చెయ్యి. దానికేముంది?" అన్నారు కృష్ణమూర్తి.

భర్తమాటలకి ఆలోచనలో పడింది అన్నపూర్ణ.

❋ ❋ ❋ ❋ ❋